రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో)... టమాట 31, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 40, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 40, దొండ 15–18, చిక్కుడు 55, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 33, దోస 28, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 40. ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్సూరాబాద్: టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నేతలు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్, పండ్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం లింగోజిగూడ డివిజన్ కృష్ణానగర్ కాలనీలోని ఆదరణ ఫౌండేషన్‌లోని విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాల వెంకట్‌రెడ్డి, కొలను సుధాకర్, ఎర్ర మహేందర్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుంగ రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం చేయొద్దు



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని కాలనీల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులతో వీవీ నగర్‌లో సమావేశమయ్యారు. కాలనీల్లో రోడ్లు శుభ్రం చేయడం లేదని, ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మలను నరికి అలాగే వదిలేయటంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొమ్మలు తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఈఈ నీలిమ, సూపర్‌వైజర్ బుచ్చయ్య, జవాన్ యాదగిరి, రాంకీ భరత్, దయాకర్, ఎస్‌ఎఫ్‌ఏ పండు, సంజీవరెడ్డి, యాకయ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



వీరభద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లే మార్గంలో పారుతున్న మురుగు

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరభద్రనగర్ కాలనీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ఈ విషయమై సీవరేజ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై మురుగు పారుతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు, వాహనదారులు చెప్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు మురుగులోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలకులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

న్యాయవాదులు చట్టాలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

సైదాబాద్: చట్టాలపై పట్టు సాధించడం ద్వారా న్యాయవాదులు తమ వృత్తిలో చక్కగా రాణిస్తారని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లో శనివారం దివంగత రాపోలు రాజ్యలక్ష్మి రాములు స్మారకార్థం ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ తరగతులను సిటీ సివిల్ కోర్ట్ జడ్జి సాయికిరణ్‌తో కలిసి రవీందర్ రెడ్డి ప్రారంభించారు.ఈనెల 23న నిర్వహించనున్న జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు హాజరవుతున్న న్యాయవాదులు ఈ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు అనువుగా ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలి



లోక్ అదాలత్‌లో జడ్జి ఎదుట రాజీ కుదుర్చుకుంటున్న కక్షిదారులు

హయత్‌నగర్: ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీపడదగ్గ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ముందుకు రావాలని హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు అదనపు జడ్జి సల్మా ఫాతిమా అన్నారు. కేసులను సత్వరం పరిష్కరించేందుకే లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం హయత్ నగర్‌లోని 14వ మేజిస్ట్రేట్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీస్టేషన్ల పరిధిలోని మొత్తం 4055 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి సల్మా ఫాతిమా మాట్లాడుతూ, కోర్టుల్లో కేసులు పేరుకుపోవడంతో వాటి పరిష్కారానికి ఎక్కువ కాలం పడుతోందని, ఈ నేపథ్యంలోనే లోక్ అదాలత్‌లను నిర్వహించి ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 7వ మెట్రోపాలిటన్ కోర్టు అదనపు జడ్జి సంకేత్ మిత్ర, రిటైర్డ్ జడ్జి రవికుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏసీపీలు అరుణోదయకుమార్, నూతన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.



సలీంనగర్-2, పార్కు సమీపంలో ధ్వంసమైన రోడ్డు

అధ్వానంగా అంతర్గత రహదారులు

- వర్షాలకు గుంతలు పడ్డ సలీంనగర్‌లోని రోడ్లు
- మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలక్‌పేట నుంచి సలీంనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి, స్థానిక కాలనీ పార్కు-2 సమీపంలో మొన్నటి వరకు అద్దంలా ఉన్న రోడ్లు వర్షానికి గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు రోడ్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిటీ నుంచి సలీంనగర్ కాలనీకి రావడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. పాడైన రోడ్ల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సలీంనగర్ వాసులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన హోండా సర్వీస్ సెంటర్ రోడ్డు

దోపిడీ దొంగల అరెస్ట్

ఒకరిపై 87, మరొకరిపై 60 కేసులు

- కళ్లలో కారం చల్లి దోచుకోవడమే వీళ్లపని
- వివరాలు వెల్లడించిన డీసీపీ

పహాడీషరీఫ్: ఇద్దరు ఘరానా దొంగలను అరెస్టు చేసిన పహాడీషరీఫ్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఒకరిపై 87, మరొకరిపై 60 కేసులు నమోదై ఉండడం గమనార్హం. వీరినుంచి రూ.2.47 లక్షల విలువైన 8తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలతో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు.

దారి దోపిడీలే లక్ష్యం

మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన టక్ సంషీర్ సింగ్(36) కుటుంబంతో కలిసి జవహర్‌నగర్ పీఎస్ పరిధిలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. నిజామాబాద్ జిల్లా కానాపూర్‌కు చెందిన దొండ్ల బాబు అలియాస్ బాబు బాలాజీ గైక్వాడ్(41) కొంపల్లిలో ఉంటున్నాడు. ఇటీవలే జైలు నుంచి విడుదలైన బాబు తన పాత స్నేహితుడైన సంషీర్ సింగ్‌తో కలిసి నగర శివారుల్లో దోపిడీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ కలిసి గత ఫిబ్రవరిలో పటాన్‌చెరు పీఎస్ పరిధిలో షైన్ బైక్(ఏపీ 39 ఎఫ్‌జడ్ 8981)ను దొంగిలించారు. దీనిపై తిరుగుతూ నిర్మానుష్య ప్రాంతాల్లో దొరికిన వారిని లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇలా మహేశ్వరం జోన్ పరిధిలో మూడు, నల్లగొండలో ఒక చోరీ చేశారు. మరో దాడికి సిద్ధమైన వీరిని పహాడీషరీఫ్ పరిధిలో పట్టుకున్నారు.

తల్లీకూతుళ్ల ప్రతిఘటనతో..

తుక్కుగూడ అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో గత మే 24న ఆరుగురు చిన్నారులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న మంఖాల్ గ్రామానికి చెందిన గడ్డమీది కల్పనను లక్ష్యంగా చేసుకుని ఇద్దరూ దోపిడీకి ప్రయత్నించారు. బైక్‌పై వచ్చి కల్పన కళ్లల్లో కారం నీళ్లు చల్లి ఆమె మెడలోని మంగళసూత్రాన్ని లాక్కున్నారు. వెంటనే తేరుకున్న కల్పన, ఆమె కూతురు లక్ష్మీప్రసన్న దుండగులతో తలపడ్డారు. బైక్ తాళాలు లాక్కుని, గట్టిగా కేకలు వేడయంతో ద్విచక్రవాహనంతో పాటు బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. వీటి ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



కల్లు తాగుతావా తాతా..

అంతకుముందు ఏప్రిల్ 14న కూడా ఇదే తరహాలో మహేశ్వరం ఠాణా పరిధిలో 72 ఏళ్ల వయసున్న ఓ గొర్రెల కాపరి వద్దకు వెళ్లిన సంషీర్ సింగ్, బాబు.. కల్లు తాగుతావా తాతా అంటూ అతన్ని మాటల్లో దించి వెంట తెచ్చుకున్న కారం నీళ్లను కళ్లలో చల్లి చేతికి ఉన్న వెండి కడియాలు, చెవి పోగును లాక్కెళ్లారు. ఇది జరిగిన ఆరు గంటల వ్యవధిలోనే కందుకూరు పీఎస్ పరిధిలోని రాచులూర్ వద్ద సాయంత్రం వేళ ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ కళ్లలో కారం నీళ్లు చల్లి బంగారు మంగళ సూత్రాన్ని లాక్కొని ఉడాయించారు. ఈ దోపిడీలపై రాచకొండ సీపీ తరుణ్ జోషి ఆదేశానుసారం డీసీపీ సునీతారెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలోనే మరోసారి దోపిడీ ప్రయత్నాల్లో ఉన్న నిందితులను పట్టుకున్న పోలీసులు శనివారం వారిని అరెస్ట్ చేశారు. తుక్కుగూడలో దొంగతనం చేసిన అనంతరం నల్లగొండ రూరల్ ఠాణా పరిధిలో కూడా మహిళ మెడలో ఇదే రకంగా బంగారు మంగళసూత్రాన్ని చోరీ చేసినట్లు విచారణలో తేలింది.

ఇరువురిపైనా పీడీ యాక్ట్

సంషీర్ సింగ్ మొదట కామారెడ్డి జిల్లాకు వలస వచ్చాడు. నిజామాబాద్ వాసి అయిన దొండ్ల బాబుతో ఏర్పడిన పరిచయంతో చోరీల బాట పట్టారు. పలు కేసుల్లో అరెస్టయి జైలు నుంచి విడుదలైన నిందితులు 2018 నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేయడం ప్రారంభించారు. అనంతరం 2019లో కామారెడ్డి ఎస్పీ వీరిద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. విడుదలైన అనంతరం ఇద్దరూ కలిసి తూప్రాన్, బిక్నూర్, నాగిరెడ్డి పేట్, పాపన్నపేట, జోగిపేట ప్రాంతాల్లో తన సోదరులు కుల్జీత్‌సింగ్, బల్జీత్ సింగ్‌లతో కలిసి పలు దోపిడీలకు పాల్పడ్డారు. ఇలా సంషీర్‌సింగ్‌పై ఏకంగా 87 కేసులు నమోదు కాగా.. 44 కేసుల్లో పరారీలో ఉన్నాడు. మరో నిందితుడైన బాబుపై 60 కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. సమావేశంలో పహాడీషరీఫ్, మహేశ్వరం ఇన్‌స్పెక్టర్లు పి.గురువారెడ్డి, వెంకటేశ్వర్లు, పహాడీషరీఫ్ డీఐ సుధీర్ కృష్ణ, ఎస్సైలు వెంకటేశ్వర్లు, మధుసూదన్ పాల్గొన్నారు.

బాక్స్ డ్రెయిన్ పనులను వెంటనే పూర్తి చేయాలి

లింగోజిగూడ: వర్షా కాలంలో వరద నీటి సమస్య తలెత్తకుండా వెంటనే బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. డివిజన్‌లోని పలు కాలనీల మీదుగా మూసీ వరకు జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను శనివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మూసీ దగ్గర వాకింగ్ ట్రాక్ ఉండటంతో 50 మీటర్ల వరకు బాక్స్ డ్రెయిన్ పనులను నిలిపేశారని తెలిపారు. వెంటనే హెచ్‌ఎండీఏ అధికారుల నుంచి అనుమతులు తీసుకొని పనులను పునః ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ మాతృనాయక్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు పాఠశాలలోనే చిన్నారులను చేర్పించండి

లింగోజిగూడ: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని నాగోలు డివిజన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అగన్వాడీ టీచర్లు స్థానిక కాలనీల్లో తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు నాణ్యమైన విద్య బోధించడంతో పాటు పుస్తకాలు, దుస్తులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. పౌష్టికాహారం, మధ్యాహ్నం భోజనం, తాగునీటి అందించడంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ, లలిత, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలతో ప్రోత్సాహం

సైదాబాద్: చదువుతో పాటు ఆట, పాటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందిస్తే వారిని మరింత ప్రోత్సహించడానికి తోడ్పడతాయని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గత విద్యా సంవత్సరంలో చదువులో ప్రతిభ చూపిన ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులకు, పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన ఏడుగురు విద్యార్థులకు గోవర్ధన్‌రెడ్డి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని వాటి సాధన కోసం ఏకాగ్రతతో శ్రమించాలని సూచించారు. శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడే యోగా, పలు రకాల క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ కె.మోహన్‌రావు, కాస్మిక్ యోగా థెరపిస్ట్ అంకతి సంగీత, పాఠశాల ప్రిన్సిపాల్ శారద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి

చంపేస్తాడని.. చంపేశాడు!

- పాత కక్షల నేపథ్యంలో బావమరిదిని హత్య చేసిన బావ
- మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఘటన
- మృతుడు, హతుడు ఇద్దరూ పాత నేరస్తులే



హత్యకు గురైన సల్మాన్ (ఫైల్)

మీర్‌పేట: పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం బావమరిదిని హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందనవనానికి చెందిన షబానాబేగం కుమారుడు సల్మాన్ (25) పలు కేసుల్లో నిందితుడు. దీంతో పోలీసులు అతడిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. ఇదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు దాసరి సురేందర్ (32).. సల్మాన్ చెల్లి ఫాతిమాబేగంను 2021లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాది తర్వాత ఆమెను భవనం పైనుంచి తోసి చంపేశాడు. దీంతో సురేందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతన్ని జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో సల్మాన్, సురేందర్ మధ్య వైరం పెరిగింది. ఇద్దరూ జైలులో ఉండగా సైతం తరచూ గొడవ పడేవారు. రెండు నెలల క్రితం (పది రోజుల తేడాలో) ఇద్దరూ జైలు నుంచి బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా సల్మాన్ పెద్దనాన్న కూతురు స్వర్ణలతతో సురేందర్ సన్నిహితంగా ఉంటున్నాడు. అప్పటికే తన చెల్లిని చంపాడని రగిలిపోతున్న సల్మాన్ బతికి ఉంటే తనకు ప్రమాదమని భావించిన సురేందర్ బావమరిదిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటల తర్వాత స్వర్ణలత ద్వారా సల్మాన్‌కు ఫోన్ చేయించి టీకేఆర్ కమాన్ సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి రప్పించాడు. వచ్చీరాగానే సురేందర్ అతనిపై కత్తితో విరుచుకుపడ్డాడు. గొంతుతో పాటు శరీరంపై దాడి చేయడంతో సల్మాన్ అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. విషయం తెలుసుకున్న సల్మాన్ తమ్ముడు అర్బాజ్ వెంటనే అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి షబానాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సురేందర్‌తో పాటు అతని అనుచరులు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు. సల్మాన్ తల్లి ముస్లిం కాగా తండ్రి హిందువు అని పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి



అగ్రికల్చర్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్‌లోని అగ్రిల్చర్ కాలనీ నుంచి జయకృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీ వరకు నిర్మిస్తున్న వర్షపునీటి కాలువ పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్నందున అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని అందుకు అధికారులు దగ్గరుండి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రిల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిబట్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీలోని 2వ వార్డు వేదపూరి కాలనీలో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు, 11వ వార్డులో బాలాజీ నగర్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్లు కుంట్ల మౌనిక ఉదయ్ పాల్‌రెడ్డి, మర్రి అర్చన రాంరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ పేరుకు చిన్నదే అయినా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందన్నారు. ఏరో స్పేస్, టాటా కంపెనీలు, ఔటర్‌రింగ్‌రోడ్డు, టీసీఎస్ లాంటి సంస్థలకు నెలవుగా ఉందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం ఇక్కడే అభివృద్ధి అవుతుందని చెప్పారు. బహుళజాతి కంపెనీలు ఉన్న చోట పలు ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారని తెలిపారు. ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని బతుకుతున్నారని వారికి మౌళిక సదుపాయలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నమన్నారు. 15 వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారులు నిరంతరం కాలనీల్లోని సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కమాండ్ల యాదగిరి, ఏఈ వీరాంజనేయు లు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, రామారావు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, పాండుగౌడ్, ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.

PASSPORT LOST

I Poleboina Kranthi S/o. Poleboina Ramulu, age 31 Yrs R/o. Arunodaya Nagar Colony, Nagole, Hyd-068. I Submit that i lost my Original Passport Bearing no. T4752337, Dt. of Issue 30-04-2019 and Dt. of Expiry 29-04-2029, while i was travelling from Raidurg to Nagole on two wheeler. On immediate arrival at my residence in Nagole, I noticed that the cover Containing the Passport is Misplaced. Inspite of my best efforts i am unable to trace it, It is lost and beyond recovery. I request the concern authorities through Affidavit No 37AA366669 to do the needfull at the earliest.

'ఉచిత విద్యుత్' ఎప్పుడు అమలయ్యేనో?

- ఎన్నికల కోడ్ నేపంతో అమలు చేయని అధికారులు
- నిరసన వ్యక్తం చేసిన వీకర్‌సెక్షన్ బస్తీవాసులు



ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని కరెంట్ బిల్లులు చేతబట్టి నిరసన తెలుపుతున్న వీకర్ సెక్షన్ కాలనీవాసులు

మన్సూరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల లోపు వారికి ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. ఎన్నికల కోడ్ పేరు చెప్పి అధికారులు తమకు పథకాన్ని అమలు చేయడం లేదంటూ మన్సూరాబాద్ వీకర్‌సెక్షన్ కాలనీవాసులు శనివారం కాలనీ కమ్యూనిటీహాల్ వద్ద కరెంటు బిల్లులతో నిరసన వ్యక్తం చేశారు. బస్తీలో కొంతమందికి ఉచిత విద్యుత్ పథకం కింద జీరో బిల్లు ఇస్తూ.. మరికొందరికి ఎన్నికల కోడ్ ఉందని, తర్వాత జీరో బిల్లు వస్తుందని చెప్తున్నారని వాపోయారు. కోడ్ ముగిసిన కూడా ఉచిత విద్యుత్ పథకం అమలు చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నికల కోడ్ అంటూ జాప్యం..

మూడు నెలల క్రితమే ఉచిత విద్యుత్ పథకం ప్రారంభమైంది. అయితే, మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక ఎన్నికల నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన జిల్లాలో కొంత భాగం రంగారెడ్డి పరిధిలోకి వచ్చింది. దీంతో రంగారెడ్డి జిల్లాలో అధికారులు ఎన్నికల కోడ్ విధించారు. ఇంతలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూడా రావడంతో ఉచిత విద్యుత్ పథకం అమలుకు నోచుకోలేదు. అంతేకాకుండా ఈ నెల ప్రారంభంలో విద్యుత్ రీడింగ్ తీసిన సమయంలో విద్యుత్ సిబ్బంది కొంత మందికి మాత్రమే జీరో బిల్లు ఇచ్చి తమకు ఇవ్వలేదని వీకర్ సెక్షన్ బస్తీవాసులు నిరసన చేపట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు ఈ పథకం అమలులో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హామీలు నీటి మూటలేనా ?



ఆరు గ్యారంటీలంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాకుండా నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకాన్ని అమలు చేయటంలో అధికారులు అనాసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్నాయా.. లేదా అనేది పరిశీలించే యంత్రాంగం లేదు. ప్రభుత్వ పథకాలు అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– నిర్మల, వీకర్ సెక్షన్ కాలనీ

ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలి



ఎన్నికల కోడ్ ముగిసినా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయటంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారులు బస్తీలో కొంత మందికి ఉచిత విద్యుత్ జీరో బిల్లు ఇస్తూ మరికొంత మందికి ఎన్నికల కోడ్ ఉందని చెప్పడం విడ్డూరంగా ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఉచిత విద్యుత్ పథకం అర్హులందరికీ అమలయ్యేలా చూడాలి.

– హేమలత, వీకర్ సెక్షన్ కాలనీ

అక్రమ నిర్మాణాల కూల్చివేత

తుర్కయంజాల్ : అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధి మన్నెగూడలోని ప్రముఖ్ టౌన్‌షిప్‌లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని జేసీ బీ సహాయంతో కూల్చివేయించారు. నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9666021515 | 9912220363
9505507616 | 9912220365